క్లుప్తంగా

కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రత్న మాణిక్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. బీఏ పొలిటికల్ సైన్స్, బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



టేకులబోరులో అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో కరుణాకర్

కూనవరం: వన్యప్రాణుల సంరక్షణ సామజిక బాధ్యత అని, ప్రకృతి విపత్తులను చాలా వరకు కట్టడి చేయవచ్చని రేంజ్ ఆఫీసర్ వి.కరుణాకర్ అన్నారు. వన్యప్రాణుల 69వ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని టేకులబోరు, కూనవరంలోని ఆలయ ప్రాంగణంలో భక్తులకు, అక్కడికి వచ్చిన ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది నుంచి మానవుడు వన్యప్రాణులతో మమేకమై జీవించడం మన సంస్కృతిలో భాగమైందన్నారు. చెట్ల నుంచి ఆచారం, పుట్టల నుంచి సంప్రదాయం అలవర్చుకొని అనాదిగా పర్యావరణ సంరక్షణకు దోహదపడుతోందన్నారు. నాయకులు ఆవుల మరియాదాస్, సాంబశివ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు




గాయపడిన శ్రీనివాసరావు

దుంబ్రిగుడ: మండలంలోని అంత్రిగుడలోని జాతీయ రహదారి మలుపులో ఒకరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అరకు లోయ ప్రాంతానికి చెందిన జి.శ్రీనివాసరావు అనే వ్యక్తి బైకుపై అరకు నుంచి పాడేరు వైపు బయలుదేరారు. మార్గమధ్యలోని అంత్రిగుడలోని జాతీయ రహదారి మలుపు వద్ద బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. చెయ్యి విరిగిపోగా తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆటోలో దుంబ్రిగుడ పీహెచ్‌సీలో క్షతగాత్రుడిని తరలించారు. పీహెచ్‌సీలో వైద్యం అందించిన సిబ్బంది క్షతగాత్రుడిని 108లో అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పొంచి ఉన్న ముప్పు

- కొండ అంచున కూలేందుకు సిద్ధంగా ఉన్న బండరాళ్లు




కురిడి గ్రామంలోని కొండ అంచులో ప్రమాదంలో ఉన్న బండరాళ్లు

దుంబ్రిగుడ: అరకు–పాడేరు జాతీయ రహదారి కురిడి గ్రామం వద్ద నూతన వంతెన సమీపంలో రాళ్లు తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే సుమారు 30 అడుగుల ఎత్తులో ఉన్న బండరాయిలు పడిపోవడానికి సిద్ధంగా ఉన్న హైవే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బండరాలన్నీ కదిలిపోయి దాని కిందనున్న పటుత్వం కోల్పోయి పడిపోవడాని సిద్ధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ సమమంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని భయంతో ప్రయాణికులు, వాహనచోదకులు ప్రయాణాలు సాగిస్తున్నారు. పొరపాటున ఈ బండరాయి ఇటు వైపు ప్రయాణిస్తున్న బస్సు, కార్లు, ద్వీచక్ర వాహనాలపై పడితే భారీ ప్రమాదం సంభవిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి ఆ బండరాయి తొలగించాలని కోరుతున్నారు.

వెతలు తీరేనా!



చింతూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం లోపల చిందరవందరగా సామగ్రి



కార్యాలయంలో ఏసీల దుస్థితి

- శిథిలావస్థలో టెలిఫోన్ కార్యాలయం
- బ్రాడ్‌బాండ్ సేవలకు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని అధికారులు

చింతూరు: స్థానిక డివిజన్‌లో తరచూ బ్రాడ్‌బాండ్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇదే తంతు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతూరు డివిజన్లో చింతూరుతో పాటు కూనవరం, వీఆర్ పురం, చోడవరం, ఏడుగురాళ్లపల్లి, మోతుగూడెం, డొంకరాయి పరిధిలో 500కు పైగా బ్రాడ్‌బాండ్ కనెక్షన్లు ఉన్నాయి. దీంతోపాటు చింతూరులోని ఐటీడీఏ, సబ్ కలెక్టర్, పోలవరం వంటి ప్రధాన కార్యాలయాలతో పాటు ట్రెజరీ, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు బ్రాడ్‌బాండ్ సేవలను వినియోగిస్తున్నారు. చిన్న చినుకు పడినా.. ఈదురుగాలులు వీచిన సేవలు స్తంభిస్తున్నాయి. సెల్ సేవలతో పాటు ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతున్నాయి. బ్రాడ్‌బాండ్ సేవలు తరచూ నిలిచిపోతుండడంతో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు బ్యాంకుల్లో గంటల తరబడి కార్యకలాపాలు నిలిచిపోతున్నాయి. దీంతో ఇటు వినియోగదారులు అటు సిబ్బంది నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలలో కనీసం పది రోజులపాటు ఇలాగే సేవలు నిలిచిపోతున్నాయని, బిల్లులు మాత్రం ప్రతినెలా వసూలు చేస్తున్నారని, బిల్లు చెల్లించకుంటే వెంటనే కనెక్షన్ తొలగిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఆదివారం సైతం ఉదయం నుంచి నిలిచిపోయిన బ్రాడ్‌బాండ్ సేవలు రాత్రి వరకు రాలేదు. ఒక్కోసారి రెండు నుంచి మూడు రోజల పాటు కూడా నిలిచిపోతున్నాయని, ఎవరికి ఫిర్యాదు చేయాలన్నా ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండడంలేదని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. గత ఐదు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్న అధికారులు సరిగా స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జరుపుతున్న తవ్వకాల్లో తరచూ కేబుల్ తెగిపోతుండడంతో కూడా అటు బ్రాడ్‌బాండ్ ఇటు సెల్‌సిగ్నల్స్ నిలిచిపోతున్నాయి. కాగా ఈ విషయంపై అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు ఫోన్‌లు కూడా లిఫ్ట్ చేయడం లేదు.

ఇదీ కార్యాలయ దుస్థితి

మరోవైపు డివిజన్ కేంద్రంలోని బీఎస్ఎన్‌ల్ కార్యాలయం దుస్థితిని చూసి వినియోగదారులు ముక్కున వేలేసుకుంటున్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో కార్యాలయం మొత్తం అస్తవ్యస్థంగా తయారైంది. కార్యాలయంలో ఎక్కడికక్కడ వైర్లు చిందర వందరగా పడి ఉండడంతో పాటు ఏసీల్లో నుంచి నీరు కారుతూ వైర్లు కాలిపోయే ప్రమాదం ఏర్పడింది. చింతూరులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జేటీవో, సబ్ ఇంజనీర్ విధులు నిర్వహించాల్సి ఉండగా వారిద్దరూ సరిగా అందుబాటులో వుండడంలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చింతూరు డివిజన్‌లో బ్రాడ్ బాండ్ సేవలు సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టాలని, చింతూరులోని కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల డిమాండ్



అరడకోట పైలెట్ ప్రాజెక్టు వద్ద బకాయి వేతనాల కోసం ఆందోళన చేస్తున్న కార్మికులు

పెదబయలు: మండలంలోని మూడు పంచాయతీలకు రెండు వారాలుగా నీటి సరఫరా జరగడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమ్మెతో మండలంలోని సీతగుంట, అరడకోట, సీకరి పంచాయతీల్లో 18 గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రపంచ బ్యాంకు నిధులు సుమారు రూ.6కోట్లతో పదేళ్ల క్రితం పైలెట్ ప్రాజెక్టు ద్వారా నీటి పథకం నిర్మించారు. అయితే ఈ పథకం నిర్మించినప్పటి నుంచి ప్రతీ రోజు అరడకోట నుంచి సీతగుంట పంచాయతీ వరకు నీరు సరఫరా జరుగుతోంది. ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా ఐదుగురు కార్మికులు పనులు చేస్తున్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని కలెక్టర్, ఐటీడీఏ పీవో, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. తమ కుటుంబాలు అర్ధ కాలితో జీవనం సాగిస్తున్నామని కార్మికులు వంశీకృష్ణ, కోటేశ్వరరావు, బొండు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు కార్మికులు అరడకోట పైలెట్ ప్రాజెక్టు వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లిస్తేనే నీటిని సరఫరా చేస్తామని కార్మికులు తెలిపారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖురేష్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త కాంట్రాక్ట్ రావడం వల్ల జాప్యం జరిగినట్టు చెప్పారు.ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోసారి ఈ సమస్యను ప్రస్తావించి, నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

మూడు పంచాయతీల ప్రజలకు నీరు అందించే పైలట్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులకు సుమారు 8 నెలల నుంచి వేతనాలు అందకపోడంతో రెండు వారాల నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో చుక్క నీరు కూడ సరఫరా కావడం లేదు. ఈ పథకం ఇప్పటి వరకు కేవలం ఇంటి అవసరాల వినియోగానికి మాత్రమే నీరు సరఫరా అవుతుంది.తాగడానికి సరిపడినంతగా శుద్ధి ట్యాంకుల నిర్మాణం చేపట్టలేదు. అయితే తరుచూ పథకం మరమ్మతుకు గురైనా కార్మికులు మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరా సజావుగా జరిగేలా చూసేవారు. ఆయా కార్మికులకు వేతనాలు అందించకపోవడంతో రెండు వారాల నుంచి పథకం నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా గ్రామాలకు నీరు సరఫరా నిలిచిపోయింది.

ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద పర్యాటక వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని నో పార్కింగ్ బోర్డులు ఉన్న స్థలంలో వాహనాలు నిలుపుదల చేయవద్దని దుంబ్రిగుడ ఎస్ఐ కె పాపినాయుడు వాహనాదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పోతంగి పంచాయతీ సర్పంచ్ వి.వెంకటరావు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, చాపరాయి నిర్వాహకుడు అప్పారావులకు పలు సూచలు చేస్తు చాపరాయిలో పర్యాటక సీజన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో పర్యాటకుల ఇష్టానుసారంగా బైక్‌లు, కార్లు వంటివి ఎక్కడపడితే అక్కడ నిలుపవద్దని సూచించారు. చాపరాయి నిర్వాహకులు బబిత, పోలీసులు ఉన్నారు.



ట్రాఫిక్ సమస్యను సర్పంచ్ వెంకటరావుకు వివరిస్తున్న ఎస్ఐ పాపినాయుడు

సూపర్‌సిక్స్ హామీలు అమలుచేయాలి

ముంచంగిపుట్టు: వంద రోజుల కూటమి ప్రభుత్వం పాలనలో ఒక్క పథకం కూడా అమలుచేయలేదని , ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో ఆదివారం మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌మన్ ద్వారా మంజూరు చేస్తున్న గృహాలకు రూ.6లక్షలు కేటాయించాలన్నారు. పీఎం జన్‌మన్ గృహాలకు రూ.2.39లక్షలు ప్రకటించిందన్నారు. అయితే ప్రసుత్తం పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో ఇళ్ల నిర్మాణాలకు ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు గిరిజనులకు ఇచ్చిన జీవో నెంబర్–3 రద్దు, ప్రత్యేక డీఎస్సీ, నూరుశాతం ఉద్యోగులు వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు నర్సయ్య, త్రినాథ్, శ్రీను, లైకోన్, ధర్మ, చంద్రయ్య, కొండయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాలగుమ్మలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర

గంజాయి అనర్థాలపై అవగాహన

అడ్డతీగల: జీవితాలను సర్వ నాశనం చేసే మహమ్మారిలాంటి గంజాయి జోలికి ఏ ఒక్కరూ వెళ్లొద్దని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. మండలంలోని భీముడుపాకలలో ఆదివారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నరసింహమూర్తి మాట్లాడుతూ గంజాయి వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయన్నారు. మత్తు పదార్థాలు ఎవరూ వినియోగించొద్దన్నారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశమవుతాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్ఐ జి.వినోద్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భీముడుపాకలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి, చిత్రంలో ఎస్ఐ వినోద్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



వ్యాపారులకు సూచనలిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



టోర్నీ నిర్వాహకులతో ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలోని వాలీబాల్ క్రీడా మైదానంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు ఓల్డ్ స్టూడెంట్స్–కర్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం క్రీడా మైదానాన్ని ఆదివారం పరిశీలించారు. మైదానంలో చెత్తా చెదారం ఉండడంతో తొలగించాలని నిర్వాహకులకు ఆదేశించారు.

తక్షణమే సిబ్బంది చెత్త తొలగింపు పనులు చేపట్టారు. టోర్నీ నిర్వాహకులు రామారావు, సత్యనారాయణ, శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసక్తి గల క్రీడాకారులు టోర్నీ నిర్వాహకులను సంప్రదించి 7వ తేది సాయంత్రంలోగా ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 77804 09662, 90006 02332, 94923 45225 నంబర్లకు సంప్రదించాలన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అరకులోయలోని ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న వారి వద్దకు వెళ్లి పలు సూచనలిచ్చారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దని, దీంతో పాదచారులకు ఇబ్బందులు కలుగుతాయని, ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అంతే కాకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ఈ కారణంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రకమించవద్దని, అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే పరిస్థితి లేదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పొర్లుబందలో గృహ నిర్మాణాలకు భూమిపూజ

చింతపల్లి: పీఎం జన్‌మన్‌లో మంజూరైన పీవీటీజీల గృహాలకు అదనపు ప్రోత్సాహాలను అందించాలని కిటుముల సర్పంచ్ రాములమ్మ కోరారు. మండలంలోని పొర్లుబందలో ఆదివారం పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణాలకు ఆమె భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ అత్యంత మారుమూల ప్రాంతంగా ఉన్న పొర్లుబందలో గృహాలు నిర్మాణం చేయాలంటే ప్రతి సామగ్రి కొండపైకి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. మెటీరియల్ రవాణాకు ఎక్కువగా నిధులు ఖర్చవుతాయని తెలిపారు. ఈ నేపథ్యంగా అదనపు ప్రోత్సాహాలను ఇవ్వాలని కోరారు. నిర్మాణ సామగ్రిని తీసుకురావడం కష్టమవుతుందన్నారు.కలెక్టర్ దినేష్‌కుమార్,పీవో అభిషేక్ దీనిపై చొరవ చూపాలని కోరారు. ట్రైకార్ మాజీ డైరెక్టర్ సుర్ల లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గడుతూరి రాధాకృష్ణ, సన్యాసిరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు



పెదబయలులో పూజలు చేస్తున్న భక్తులు



దూసరపాములో బాలాత్రిపుర సుందరి అలంకరణలో దుర్గమ్మ



కొయ్యూరులోని బతుకమ్మ వేడుకలో భక్తులు

పెదబయలు: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మండపంలో ఏర్పాటుచేసిన ఆదివారం శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దీక్షలు చేపట్టిన భవానీ మాలధారులు అమ్మవారికి పూజలు, భజనలు చేశారు. అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గోత్రనామాలతో పూజలు, కుంకుమ పూజ చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ప్రసాద వితరణ జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి సింహాచలం, మోటార్ యూనియన్ నాయకులు భక్తులు పాల్గొన్నారు.

కొయ్యూరు: దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా కొయ్యూరులో ఆదివారం సాయంత్రం భవానీ మాలధారులు, భక్తులు బతుకమ్మ వేడుకను నిర్వహించారు. పూలమాలలతో బతుకమ్మను తయారుచేసి ప్రతిష్ఠించి, దాని చుట్టూ నృత్యాలు చేశారు. అనంతరం బోనాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకెళ్లారు. శరన్నవరాత్రుల సందర్భంగా కొయ్యూరులో బతుకమ్మ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఆదివారం శరన్నవరాత్రి మహోత్సవాలు నాల్గవరోజు వైభవంగా జరిగాయి. ఆలయాల్లో దుర్గాదేవి శ్రీబాల తిపుర సుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దుర్గమ్మకు పూజలు చేశారు.

కొట్టుకుపోయిన వంతెన.. నిలిచిన రాకపోకలు



గంగవరం వద్ద కొట్టుకుపోయిన వంతెన

సీలేరు: ఇటీవల కురిసిన భారీ వర్షానికి దారకొండ పంచాయతీ గంగవరం వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోయిన సంఘటన తెలిసిందే. దీంతో గిరిజనులు రాకపోకల కోసం ఇటీవల రెండు తూరలు వేసిపైన గ్రావెల్ వేసి తాత్కాలిక వంతెన నిర్మించారు. అయితే ఆదివారం సాయంత్రం ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహించడంతో తాత్కాలికంగా నిర్మించిన వంతెన కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గంగవరం, చిన్నగంగవరం ,పెద్దగంగవరం, నరమామాడిగొంది, పేట్రాయి, ఒడిశాకు చెందిన బందమామిడి,రే ఖపాడు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.అధికారులు స్పందించి గంగవరం వద్ద కొట్టుకుపోయిన వంతెనను మరమ్మత్తులు చేపట్టాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

నేడు గ్రీవెన్స్

వై.రామవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పాల్గొంటున్నారని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా రావాలని సూచించారు. మండలంలోని ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు. గ్రీవెన్స్ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, స్థానికులు వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చని ఎంపీడీవో బాపన్నదొర కోరారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయితీ గొందివలసలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం నిరసన వ్యవక్తం చేశారు. గ్రామంలోని తాగునీటి ఎద్దడి వల్ల గత్యంతరం లేక సమీపంలోని కొండవాగు ద్వారా స్థానికులు కలుషిత నీటిని వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా కొండవాగు వద్దకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో తాగునీటి కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాశ్వత నీటి పథకం లేక గ్రామస్తులు కొండవాగులను ఆశ్రయిస్తున్నారని, అక్కడి కలుషిత నీటి వల్ల స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైపులు కోట్టుకుపోయయాని కలుషిత నీటీతో అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులకు సమస్యను తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గొందివలసలో తాగునీటి పథకాన్ని మంజూరు చెయాలని డిమాండ్‌చేశారు. గొందివలస గ్రామ మహిళలు పాల్గొన్నారు.



గొందివలసలో మహిళలతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేత బాలరాజు

సారాతో వ్యక్తి అరెస్టు

రాజవొమ్మంగి: స్థానికంగా సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. నిందితుడి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామన్నారు. గంజాయి రవాణా, సారా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ముంచంగిపుట్టు: ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి పనులు, స్నేహితులతో ఆటలు.. అవన్నీ ఓ మధురమైన క్షణాలు.. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1లో 1995–96 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం జరిగింది. అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 28 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అలనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ పర్తాపుట్టు గ్రామ సమీపంలో సమ్మేళనం ఏర్పాటు చేసుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా విందు భోజనాలతో సందడి చేశారు. రానున్న రోజుల్లో ప్రతి ఏడాది అందరూ కలవాలని నిర్ణయం తీసుకున్నారు. తమ సహచరుల్లో అనారోగ్యంతో మృతి చెందిన 11 మంది మిత్రులను స్మరించుకొని ఘన నివాళులర్పించారు. వారి కుటుంబాలకు తమ వంతు సహకారం అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, తాము చదువుకున్న పాఠశాలకు సైతం అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు చెప్పారు.